TELTEL/2022/83842

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

గురువారం 26, మార్చి 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :189 | పేజీలు :4 | వెల. 3/-

రేవంత్ రెడ్డి.. దమ్ముంటే

## నాపై పోటీ చేయ్..



- ముఖ్యమంత్రికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్
- మరోసారి కాంగ్రెస్ కు అధికారం రాదని జోస్యం

04



రాకేశ్ రెడ్డిపై

## మంత్రుల ఆగ్రహం

- ఇప్పపువ్వు సారా అంశంపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు కలకలం
- పలువురు మంత్రులు సీరియస్

04

ఐదేళ్లుగా

# నిరీక్షణ..!

- ప్రారంభానికి ముందే శిథిలావస్థలోకి..
- రూ. 13 లక్షల ప్రజాధనం వృథా
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పట్టింపులేని తనం
- గ్రామ పాలన అంతా అద్దె భవనంలోనే
- ఇబ్బందులు పడుతున్న పాలకవర్గం, ప్రజలు
- నారాయణపురంలో పాలన గాలిలో దీపమేనా?

## నిర్మాణం పూర్తికాని పంచాయతీ భవనం!

గ్రామ అభివృద్ధికి కేంద్రబిందువుగా నిలవాల్సిన పంచాయతీ భవనం నిర్మాణం పూర్తికాక ముందే శిథిలావస్థకు చేరుకోవడం, లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా కావడం నారాయణపురం గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సుమారు రూ.13 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టిన ఈ భవనం ఐదేళ్లు గడిచినా ప్రారంభానికి నోచుకోకపోవడంతో పాటు నిర్లక్ష్యానికి గురై పాడైపోతుండటం అధికార యంత్రాంగంపై అనుమానాలు రేకెత్తిస్తోంది. కాంట్రాక్టర్ అలక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా పనులు మధ్యలోనే ఆగిపోవడంతో, గ్రామ పాలన అద్దె భవనాల్లో సాగుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి మాటల్లోనే మిగిలిపోయి, వాస్తవంలో అమలు కాని పరిస్థితులను ఈ ఘటన స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.

2

— మహబూబాబాద్, ప్రభాత గమనం



నారాయణ పురం గ్రామ పంచాయతీ కార్యాలయం




## బ్యాంకర్లు సహకరించాలి

- జిల్లాలో రూ.4,830 కోట్ల రుణ లక్ష్యం.. 75% పురోగతి
- ఇందిరమ్మ ఇళ్లకు ఆర్థిక సహాయం పెంచాలి
- ముద్ర లోన్లు, సోలార్ ప్లాంట్లు, ఈవీలకు రుణాలు ప్రోత్సహించాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

03



శ్రీరామ నవమికి

## కవిత కొత్తపార్టీ

- తెలంగాణ ప్రజా జాగృతికి శ్రీకారం
- 27న అధికారికంగా ప్రకటించే అవకాశం
- సంబురాల్లో జాగృతి కార్యకర్తలు

04


దళితుల కుటుంబాలకు పెద్దన్నలా

## సమ్మి గౌడ్ ఫౌండేషన్

- బాధిత కుటుంబానికి సాయం
- మృతుడు సోమారపు సాయిలు కుటుంబానికి పరామర్శ



3



కాంగ్రెస్ పార్టీకి

## జీవన్ రెడ్డి రాజీనామా

04

- తనకు పదవి ముఖ్యం కాదని ప్రకటన
- ఆత్మగౌరవం కోసమే పార్టీని వీడానని ఉద్ఘాటన
- ఇకపై సీఎం రేవంత్ పైనే పోరాడతానని స్పష్టీకరణ

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక



# ఐదేళ్లుగా నిరీక్షణ..!

## నిర్మాణం పూర్తికాని పంచాయతీ భవనం!

- ప్రారంభానికి ముందే శిథిలావస్థలోకి..
- రూ. 13 లక్షల ప్రజాధనం వృథా
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పట్టింపులేని తనం
- గ్రామ పాలన అంతా అద్దె భవనంలోనే
- ఇబ్బందులు పడుతున్న పాలకవర్గం, ప్రజలు
- నారాయణపురంలో పాలన గాలిలో దీపమేనా?

**మహబూబాబాద్, మార్చి 25 (ప్రభాత గమనం):**

"గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు.. వాటి అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యం" అంటూ వేదికలపై ప్రజాప్రతినిధులు చెప్పే మాటలు కోటలు దాటుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో నిర్మించిన పంచాయతీ భవనమే ఇందుకు సజీవ సాక్ష్యం. ఐదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ భవన నిర్మాణం నేటికీ పూర్తికాక, ప్రారంభానికి నోచుకోక వెక్కిరిస్తోంది.

### నిధులు మంజూరు.. పనులు అసంపూర్ణం

గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ (NREGS) నిధుల కింద సుమారు రూ. 13 లక్షలతో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామానికి ఒక సొంత పరిపాలనా భవనం ఏర్పడుతుందని గ్రామస్తులు సంబరపడ్డారు. కానీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఈ భవనం తుది దశలోనే ఆగిపోయింది. నేడు అది ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంటుండటం గమనార్హం.

> **తక్షణమే ప్రారంభించాలి..**
> **- తాడూరి ఉమేష్, గ్రామస్థుడు**
>
> 
>
> **"కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం వల్లే పంచాయతీ భవనం శిథిలావస్థలకు చేరుతోంది. బిల్లులు తీసుకుని పనులు ఆపేసిన గుత్తేదారుపై కఠిన చర్యలు తీసుకోవాలి. తక్షణమే పంచాయతీ భవనాన్ని పూర్తి చేసి గ్రామస్తులకు అందుబాటులోకి తేవాలి."**

### యథేచ్ఛగా బిల్లులు డ్రా..

ఈ భవన నిర్మాణానికి సంబంధించి గుత్తేదారు ఇప్పటికే పూర్తిస్థాయిలో బిల్లులు డ్రా చేసుకున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు. పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. నిధులు వినియోగించినా భవనం ఎందుకు పూర్తి కాలేదని, దీని వెనుక ఎవరి హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనాన్ని ఇలా దుర్వినియోగం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రైవేట్ భవనాల్లోనే పంచాయతీ 'పంచాయితీ'

సొంత భవనం లేకపోవడంతో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి విధిలేక ప్రైవేట్ భవనాల్లోనే సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికి వేదిక కావాల్సిన పంచాయతీ కార్యాలయం లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారుతోంది. "పేరు గొప్ప.. ఊరు దిబ్బ" అన్నట్లుగా నారాయణపురం పరిస్థితి తయారైందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

### రాష్ట్ర స్థాయి నాయకులున్నా..

భూముల సమస్యల నుంచి రాజకీయ వేదికల వరకు రాష్ట్రవ్యాప్తంగా గళం విప్పే నాయకులు ఈ గ్రామంలో ఉన్నప్పటికీ, సొంత ఊరి పంచాయతీ భవనాన్ని పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

# పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- పన్నుల వసూళ్లతో పట్టణ అభివృద్ధి
- కౌన్సిలర్లు,అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్




మహబూబాబాద్ మార్చి 25(ప్రభాత గమనం): బుధవారం తొర్రూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ శ్రావణ్ కుమార్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై మాట్లాడారు..గ్రామాలు పట్టణాలు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని ముందుకు సాగుతుందని అందులో భాగంగానే గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి అభివృద్ధికి దోహద పడిందని తెలిపారు. తొర్రూరు మున్సిపల్ పట్టణ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధి చేయాలని అందుకు ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. వార్డులలో అంతర్గత అభివృద్ధి పనులు సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులు, పట్టణ ప్రకృతి వనాల అభివృద్ధి, చెట్లు నాటడం, పచ్చదనం, పరిశుభ్రత పాటించడం, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా షెడ్యూలు ప్రకారం కేటాయించిన అభివృద్ధి పనులు నిర్వహించాలని తెలిపారు. తమ వార్డు పరిధిలో ఏం జరుగుతుందనే అంశాలను గమనిస్తూ ఉండాలని సూచించారు.యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా గమనిస్తూ ఉంటూ ఏదైనా సంఘవిద్రోహ కార్యక్రమాలకు పాల్పడితే సంబంధిత పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించాలని తెలిపారు.పట్టణ పరిధిలో అభివృద్ధి పనులు నిర్వహించడానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కౌన్సిల్ సమావేశం ఆమోదం తీసుకొని పనులను ప్రారంభించాలని పేర్కొన్నారు. పట్టణంలో ఎప్పటికప్పుడు ఉదయమే శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ యొక్క పన్నులను చెల్లించాలని, తద్వారా పట్టణ అభివృద్ధికి తమ భాగస్వామ్యం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

### బడ్జెట్ అంచనాలు

ఆదాయం : 1784.98 లక్షలు, వ్యయము : 1783.22 లక్షలు ప్రవేశపెట్టి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ సోమ రజిని, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఆశాలకు రూ.18 వేలు వేతనం ఇవ్వాలి

**- సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్**

కేసముద్రం మార్చి 25(ప్రభాత గమనం): ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో వెంటనే ఆశ వర్కర్లకు రూ.18000 వేల వేతనం వెంటనే అమలు చేయాలని సిఐటీయు మండల కార్యదర్శి జల్లె జయరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం మండల కేంద్రంలోని గాంధీ సెంటర్లో ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు కొండెటి విజయ, పందుల ఉపేంద్రల ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జల్లే జయరాజ్ మాట్లాడుతూ..గత 16 రోజులుగా సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లకు వెంటనే వేతనం పెంచాలన్నారు.ప్రభుత్వం సమ్మె చేసిన సందర్భంగా రూ. 18 వేల రుపాయల గౌరవ వేతనం ఇస్తామని చెప్పి నేడు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. కరోనా కష్ట కాలంలో ఆశా వర్కర్ల పనితీరు అద్భుతం అన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. ప్రభుత్వం వారికి రూ.18 వేల వేతనం వెంటనే ఇవ్వాలన్నారు. వీటితో పాటు 10 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని తెలిపారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్, సీనియార్టీ ప్రకారం ఆశాలను ఏఎన్ఎం పోస్టులలో పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కే.పూలమ్మ, నాగమణి, కోమల, స్పందన, సువర్ణ, రమ,సరిత, సుజాత, జ్యోతి, శిరీష, అనిత, దేవేంద్ర, మల్లేశ్వరి, అలీమా, శారద, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఆశాల సమస్యలను పరిష్కరించాలి

**సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత**



గార్ల మార్చి 25(ప్రభాత గమనం): వైద్య శాఖలో తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలకు రూ.18 వేల వేతనాలు చెల్లించాలని ఆశా వర్కర్స్ యూనియన్ మండల నాయకురాలు పి రమాదేవి డిమాండ్ చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన లో భాగంగా బుధవారం అంబేద్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆశాల పై పనిభారం తగ్గించాలని, పెండింగ్ లో ఉన్న వేతనాలు చెల్లించాలని, ఆశా కార్యకర్తలు మరణిస్తే యాబై లక్షల ఇన్సూరెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఆశా యూనియన్ నాయకులు, ఆశా కార్యకర్తలు నమ్మి, ఆశాకుమారి, విజయ, కౌసల్య, భద్రి, శాంతి,బుల్లి, నీలమ్మ, భద్రమ్మ ఉన్నారు.



- పేద కుటుంబాలకు అండగా నేనున్నానంటూ భరోసా
- బాధలో ఉన్న కుటుంబానికి చేయూత
- మృతుడు సోమారపు సాయిలు కుటుంబానికి పరామర్శ
- క్వింటా బియ్యం వితరణ..
- ఉదారతను చాటుకున్న సమ్మిగౌడ్, కోతి వెంకటేశ్వర్లు గౌడ్, మల్లయ్య యాదవ్

## దళితుల కుటుంబాలకు పెద్దన్నలా
# సమ్మి గౌడ్ ఫౌండేషన్

మహబూబాబాద్ మార్చి 25(ప్రభాత గమనం): మానవత్వమే మతం అని చాటుతూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలో సమ్మి గౌడ్ ఫౌండేషన్ మరోసారి తన ఉదారతను చాటుకుంది.కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన పెద్ద సోమారపు సాయిలు ఆకస్మిక మరణం ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఈ విషయం కోతి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లయ్య విషయం తెలుసుకుని ఫౌండేషన్ అధినేత చిలివేరు సమ్మి గౌడ్ కు సమాచారం అందజేశారు.ఈ నేపథ్యంలో వెంటనే విషయం తెలుసుకున్న సమ్మీ గౌడ్ బుధవారం బాధితుల ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. సాయిలు భార్య పూలమ్మ, కుమార్తె రమ్య మరియు వారి పిల్లలను ఓదార్చిన. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన సమ్మి గౌడ్.. "మేము ఉన్నాం.. అధైర్య పడకండి" అంటూ వారికి ధైర్యాన్ని ఇచ్చారు. ఇంటికన్నే గ్రామ పెద్దలు, కేవలం మాటలతో సరిపెట్టకుండా, తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేశారు..

### గ్రామ నాయకుల ప్రశంసలు:

ఈ మానవీయ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..కేసముద్రం మండలంలో పార్టీలకు,కులాలకు, మతాలకు, సంబంధం లేకుండా కడు భీధవాడు కష్టంలో ఉన్నాడు అనీ తెలియజేసిన వెంటనే స్పందించి వారి గ్రామానికి వచ్చి సమ్మి గౌడ్ చేస్తున్న సామాజిక సేవలు వెలకట్టలేనివని ఈ సందర్భంగా కొనియాడారు..కార్యక్రమంలో సమ్మిగౌడ్ వెంట కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రాజులపాటి మల్లయ్య, కోతి వెంకటేశ్వర్లు, భూక్య దేవేందర్, చెలగోల కట్టయ్య, చిలగోల ముత్తయ్య, మిట్టగడుపుల యాకయ్య, కదిర రాజు, దోమ్మటి రాజు, కదిరి హరీష్, వర్దల్లి రంజిత్, బానోతు యాకోబు, మంగ్య, వార్డు సభ్యులు బోళ్ళ రమేష్, దారావత్ లాలు, భూక్య వెంకన్న తదితరులు పాల్గొని సమ్మి గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నెక్కొండను నియోజకవర్గంగా
# ఏర్పాటు చేయాలి

### - మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్



నెక్కొండ మార్చి 25(ప్రభాత గమనం): డెలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా నెక్కొండ మండలాన్ని ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు, మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. నెక్కొండను నియోజకవర్గంగా ప్రకటిస్తే ప్రాంతీయ అభివృద్ధి వేగవంతమవుతుందని, ప్రజలకు పరిపాలన మరింత చేరువ కావడంతో పాటు ప్రభుత్వ సేవలు త్వరితగతిన అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గం ఏర్పడితే మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారులు, తాగునీరు, విద్య, వైద్య రంగాల్లో గణనీయమైన పురోగతి సాధ్యమవుతుందని, రైతులకు సాగునీటి సదుపాయాలు మెరుగుపడటంతో పాటు వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం లభిస్తుందని వివరించారు. దీనివల్ల యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, మహిళల స్వయం సహాయక సంఘాలు బలోపేతం కావడంతో పాటు చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం లభించి ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు కావడానికి కొత్త నియోజకవర్గం కీలకంగా మారుతుందని, తద్వారా ప్రాంతీయ అసమానతలు తగ్గి సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని అజయ్ కుమార్ స్పష్టం చేశారు.



# బ్యాంకర్లు సహకరించాలి

### - జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

మహబూబాబాద్ మార్చి 25(ప్రభాత గమనం): ప్రభుత్వ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. రైతుల పంట రుణాలు, విద్యా రుణాలు, ఎస్‌హెచ్‌జీ రుణాలు, ఇతర అంశాలపై కలెక్టర్ బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకర్లతో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, దానికి సంబంధించిన పురోగతి తదితర అంశాలను లీడ్ బ్యాంకు మేనేజర్ వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లా వార్షిక రుణ ప్రణాళిక వివిధ రంగాలకు సంబంధించి రూ.4830.32కోట్ల లక్ష్యంగా నిర్ణయించగా 2025, డిసెంబరు నాటికి 75.15 శాతం వివిధ రుణసహాయం అందించినట్లు తెలిపారు. రైతులకు రుణ లక్ష్యాలు చేరుకోవడంలో మరింత పురోగతి సాధించాల్సి ఉందన్నారు. నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి ఆర్థికంగా తోడ్పాటునిచ్చే ప్రణాళికలు ఉంటే వాటిని పరిశీలించాలని, ఏజెన్సీ ప్రాంత ప్రజలకు బ్యాంకర్లు ఆర్థిక తోడ్పాటు అందించాలన్నారు. అదేవిధంగా ముద్ర లోన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆసక్తి ఉన్న వారికి సోలార్ ప్లాంట్ నిర్మాణానికి, ఎలక్ట్రిక్ వెహికిల్స్ కొరకు సబ్సిడీ పొందే విధంగా లోన్లు అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో నాబార్డ్ అధికారి రవి,ఆర్బీఐ ఎల్డివో డిబొజిత్ బర్వా, ఎల్‌డీఎం యాదగిరి, డీఆర్‌డీవో మధుసూదన రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పదిలో వంద శాతం
# ఫలితాలు రావాలి

- వసతి గృహాల్లో మెనూ పక్కగా అమలు చేయాలి
- ప్రతీ హాస్టల్ లో కంప్లయింట్ బాక్స్ ను ఏర్పాటు చేయాలి
- ట్రైబల్ వెల్ఫేర్ డీడీ దేశిరాం నాయక్

మహబూబాబాద్ మార్చి 25(ప్రభాత గమనం): బుధవారం కురవి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏటీ డీవో లు, పిఎంఆర్సి స్టాఫ్, హెడ్మాస్టర్ లు హాస్టల్ వెల్ఫేట్ ఆఫీసర్లు,ఎస్సిఆర్పి లతో కురవి బాలికల హాస్టల్ కురవిలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మాట్లాడుతూ..పదవ తరగతిలో 100% ఫలితాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలనీ, వసతి గృహాలలో మెనూ తప్పకుండా అమలు చేయాలనీ తెలిపారు. ప్రతి రికార్డులు రిజిస్టర్లు ప్రతిరోజు నమోదు చేసుకోవాలని సూచించారు. ముందస్తుగా బడిబాట కోసం హెడ్మాస్టర్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తగిన ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడ,మహబూబాబాద్ ఏటిడివోలు ఆర్. భాస్కర్ ,ఉపేందర్, ఏసియంవో డి. రాములు,జిసిడిఓ కే .విజయ, డిప్యూటీ డియివో సారయ్య, స్థానిక హెచ్యం బాబు , వార్డెన్ యం . సునీత,డిఆర్పి శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ సోమని, హెడ్మాస్టర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు మరియు ఎస్ సి ఆర్పి లు పాల్గొన్నారు.

## నిధుల దుర్వినియోగంపై
# ఎంపీడీవోకు ఫిర్యాదు

### సర్పంచ్, కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలి

గార్ల మార్చి 25(ప్రభాత గమనం): గార్ల మండలం కోట్యానాయక్ తండాలో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని బుధవారం నాడు కోట్య నాయక్ తండ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు కలిసి ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్ కార్యదర్శులు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. గ్రామ సర్పంచ్ కార్యదర్శి కలిసి గ్రామసభ జరపకుండా ఎలాంటి తీర్మానం లేకుండా, పనులు జరగకుండానే రూ.4.5 లక్షల బిల్లులను డ్రా చేశారని ఆరోపించారు. గ్రామ అభివృద్ధికి వెచ్చించాల్సిన నిధులను సొంతానికి వాడుకున్న సర్పంచ్, కార్యదర్శిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు రవీందర్, కళ్యాణి, వీరన్న, బేబి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం
26.03.2026
www.prabhatagamanam.com

PRABHATA GAMANAM ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

# రేవంత్ రెడ్డి.. దమ్ముంటే నాపై పోటీ చేయ్..

- ముఖ్యమంత్రికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్
- మరోసారి కాంగ్రెస్ కు అధికారం రాదని జోస్యం



ప్రభాత గమనం, సిద్దిపేట : సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే తనపై పోటీ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. బుధవారం ఆయన ఈ మేరకు సిద్దిపేటలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు కంటున్నారని, ఆయన తల్లకిందులుగా తపస్సు చేసినా అది అసాధ్యమని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి ఎప్పుడు, ఎలా గోల్ కొట్టాలో బాగా తెలుసని, సమయం వచ్చినప్పుడు బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. వేరే వాళ్లను పంపడం కాకుండా, నేరుగా సిద్దిపేటలో తనపై పోటీకి రావాలని రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు రైతులను కూడా దారుణంగా మోసం చేసిందని హరీశ్ రావు మండిపడ్డారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్ సర్కారుపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని విశ్లేషించారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశాలను తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. పునర్విభజన వల్ల భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకే రాజకీయంగా మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తారనే ప్రచారంపై ఆసక్తికరంగా స్పందించారు. యన వస్తారా లేదా అనేది ఇప్పుడే చెప్పడం కంటే, వేచి చూస్తేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

## రాకేశ్ రెడ్డిపై మంత్రుల ఆగ్రహం

- ఇప్పపువ్వు సారా అంశంపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు కలకలం
- పలువురు మంత్రులు సీరియస్


ప్రభాత గమనం, హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో ఇవాళ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి 'ఇప్ప పువ్వు సారా'పై తన వెర్షన్ వినిపించగా, అధికార, విపక్ష నాయకుల మధ్య మాటల తూటాల పేలాయి. ఈ క్రమంలోనే బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్ప సారా అంశం ప్రభుత్వానికి నవ్వులాటగా ఉందని, ఆ ఉత్పత్తి ద్వారా 130 దేశాల్లో ఆదాయం వస్తుందంటూ అనిరుధ్ రెడ్డి చేసిన ప్రసంగంపై సెటైర్లు వేశారు. ఒకవేళ ప్రభుత్వం ఇప్ప సారా తయారు చేస్తే, దానికి 'ఇందిరమ్మ' పేరు మాత్రం పెట్టవద్దని కామెంట్ చేశారు. అయితే, రాకేశ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఏం తమాషాగా ఉందా రాకేశ్ రెడ్డి..' అంటూ మండిపడ్డారు. సారా అంశం గురించి మాట్లాడుతున్నప్పుడు సభలో ఇందిరమ్మ పేరు తీసినందుకు రాకేశ్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఇప్ప పువ్వ సారా అంశంలో ఇందిరమ్మ పేరు ఎత్తడం మహిళా లోకాన్ని అవమానించడమేనని అన్నారు. మరోవైపు మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ.. రాకేశ్ రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆయన క్షమాపణలు చెప్పాలని పట్టుబట్టారు. బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మాట్లాడుతూ.. ఇందిరమ్మ పేరుపై గంటకు పైగా సభా సమయం వృథా చేయడం సరికాదన్నారు. సభ్యుడు తప్పుగా మాట్లాడి ఉంటే ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు.

## శ్రీరామ నవమికి కవిత కొత్తపార్టీ

- తెలంగాణ ప్రజా జాగృతికి శ్రీకారం
- 27న అధికారికంగా ప్రకటించే అవకాశం



ప్రభాత గమనం, హైదరాబాద్: మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. శుక్రవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమె కొత్త పార్టీని ప్రకటించబోతున్నారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా దశాబ్ద కాలానికి పైగా సామాజిక, సాంస్కృతిక రంగాల్లో పనిచేసిన కవిత, ఇప్పుడు తన రాజకీయ పంథాను మార్చుకుంటున్నారు. తన నూతన పార్టీకి 'తెలంగాణ ప్రజా జాగృతి' అనే పేరును ఖరారు చేశారు. ఈ పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం వద్ద కొనసాగుతోంది. దీనిపై ఢిల్లీ హైకోర్టులో జరిగిన విచారణ కూడా తుది దశకు చేరుకున్నట్లు సమాచారం. ఈ నెల 27న ఉదయం 8 గంటలకు ఆమె అధికారికంగా పార్టీ పేరును ప్రకటించనున్నారు. తన రాజకీయ అస్థిత్వానికి వేదికైన నిజామాబాద్ (మెట్టినిల్లు) నుంచే పార్టీ జెండా, గుర్తు మరియు విధివిధానాలను వెల్లడించే అవకాశం ఉంది. గాంధీజీ ప్రతిపాదించిన సర్వోదయ సిద్ధాంతం ప్రాతిపదికన, సామాజిక తెలంగాణే లక్ష్యంగా ఈ పార్టీ పనిచేస్తుందని ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ ఉద్యమకారులకు, యువతకు పార్టీలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కొత్త పార్టీ ప్రకటనతో పాటు, రాబోయే ఎన్నికల్లో కవిత ఎక్కడి నుంచి పోటీ చేయబోతున్నారనే అంశంపై కూడా అదే రోజు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతగా ఉన్న ఆమె, ఇప్పుడు సొంత కుంపటి పెట్టడం వెనుక ఉన్న రాజకీయ సమీకరణాలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. కుటుంబ రాజకీయాల నుంచి బయటకు వచ్చి స్వతంత్రంగా తన బలాన్ని నిరూపించుకోవాలనే పట్టుదలతో ఆమె ఉన్నట్లు కనిపిస్తోంది.



## కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా

- తనకు పదవి ముఖ్యం కాదని ప్రకటన
- ఆత్మగౌరవం కోసమే పార్టీని వీడానని ఉద్ఘాటన
- ఇకపై సీఎం రేవంత్ పైనే పోరాడతానని స్పష్టీకరణ

ప్రభాత గమనం, జగిత్యాల : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, శాసన మండలి సభ్యుడు జీవన్‌రెడ్డి బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. సుమారు 42 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకలా నిలిచిన ఆయన, జగిత్యాలలో తన అనుచరులతో సమావేశమై ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన జీవన్ రెడ్డి, పార్టీలో తనకు జరిగిన అవమానాలను ఏకరువు పెట్టారు. పార్టీలో గత రెండేళ్లుగా తాను తీవ్ర అగౌరవానికి గురయ్యానని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టార్జితంతోనే రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందని, కానీ అదే కార్యకర్తలకు నేడు రక్షణ కరువైందని మండిపడ్డారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తన రాజీనామా లేఖను పంపుతున్నట్లు ఆయన వెల్లడించారు. తనకు అత్యంత సన్నిహితుడైన కాంగ్రెస్ కార్యకర్త గంగారెడ్డిని నడిబజారులో కిరాతకంగా చంపిన ఘటన జీవన్ రెడ్డిని తీవ్రంగా కలచివేసింది. "ఒక కార్యకర్త దారుణంగా చనిపోతే ముఖ్యమంత్రి నుంచి కనీస పరామర్శ లేదా ఓదార్పు లేదు. ఆ కుటుంబానికి భరోసా కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది" అని ఆయన ధ్వజమెత్తారు. ఒక ఎమ్మెల్సీగా ఉండి కూడా న్యాయం కోసం తాను రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయని జీవన్ రెడ్డి విమర్శించారు. "నాకు పోరాటం కొత్త కాదు.. ఇకపై రేవంత్ రెడ్డిపైనే నా పోరాటం సాగుతుంది" అని ఆయన సవాల్ విసిరారు. కార్యకర్తలు, అనుచరుల అండతోనే ఇన్నాళ్లూ రాజకీయాల్లో కొనసాగానని, వారి అభిప్రాయం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు.

### - బీఆర్ఎస్ వైపు చూపు?

ఇటీవల మాజీ మంత్రి హరీశ్ రావు సైతం జీవన్ రెడ్డి పార్టీ మార్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో, ఆయన తదుపరి అడుగు ఎటువైపు ఉంటుందనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 42 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకున్న ఆయన, రేవంత్ సర్కారుకు ఎలాంటి సవాళ్లు విసరనున్నారో వేచి చూడాలి.

Published and Owned by Pitta Sreekanth at .H NO 1-7-883/6/101 VIVEKANANDA COLONY HUNTER ROAD HANUMAKONDA, WARANGAL URBAN, TELANGANA, 506001 Editor. P. Ravichandra